క్లుప్తంగా

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ



గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సీడీపీఓ విమలారాణి

పాతపట్నం: మండలంలోని వివిధ గిరిజన గ్రామాల్లో నందిగాం మండలం పెద్దగురువూరు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు జె.విశాఖరావు ఆధ్వర్యంలో గిరిజనులకు సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. మండలంలోని చిన్నమల్లిపురం గ్రామంలో ఐసీడీఎస్ సీడీపీఓ టి.విమలారాణి గిరిజనులకు దుప్పట్లు అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.ప్రియవధ, గ్రామస్తులు పాల్గొన్నారు.

దళిత సంఘాల నేతల ఆత్మీయ సమ్మేళనం



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నేతలు

సరుబుజ్జిలి: బూర్జ మండల పరిధిలోని నారాయణపురం ఆనకట్టకు సమీపంలో సోమవారం దళిత సంఘాల నేతల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ సంఘాల ప్రతినిధులు ఉద్యోగ, ఉపాధ్యాయ, దళితుల సమస్యలు, ఐక్యతకు సంబంధించి చర్చించుకున్నారు. దళితుల సంక్షేమం కోసం ఉత్తరాంధ్రలో కమిటీ ఏర్పాటు చేసి అంబేడ్కర్ ఆశయ సాధన దిశగా పనిచేసేందుకు పెద్దలంతా కలిసి తీర్మానం చేశారు. ఈ సమావేశంలో దళిత మహాసభ నేతలు రాయి సూర్యనారాయణ, పోతల దుర్గారావు, అన్ను వెంకటరావు, పోతయ్య పాల్గొన్నారు.

ఒడిశా మద్యం సీసాల స్వాధీనం

పాతపట్నం: మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఎస్ఐ మహమ్మద్ యాసిన్ ఆధ్వర్యంలో సోమవారం తనిఖీలు నిర్వహించారు. శ్రీకాకుళం పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై నాలుగు ఒడిశా మద్యం సీసాలను తీసుకువస్తుండగా పట్టుకున్నారు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉర్జాం అభివృద్ధికి కృషి



రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

పోలాకి: ఉర్జాం గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. రూ.35 లక్షలతో గ్రామానికి సీసీ రహదారి ఏర్పాటు చేసేందుకు సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక సర్పంచ్ కణితి సత్తిబాబు అధ్యక్షతన నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి, పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎలాంటి వివక్ష లేకుండా పరిపాలన అందిస్తున్నామని గుర్తుచేశారు. తాము మేలు చేస్తేనే వచ్చే ఎన్నికల్లో ఓటేయండి అని చెప్పి ప్రజలకు వద్దకు వస్తామని స్పష్టం చేశారు. విపక్షాలు కేవలం ఉనికి కోసం మాత్రమే రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, ఏఎంసీ చైర్మన్ దుంపల భాస్కరరావు, పార్టీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, నాయకులు రెంటికోట త్రినాథరావు, కె.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

లబ్బలో పంట కోత ప్రయోగం



పంట కోత ప్రయోగం చేస్తున్న సిబ్బంది

కొత్తూరు: మండలంలోని లబ్బ గ్రామానికి చెందిన రైతు జమ్మయ్య వరి పొలంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ ఎంటీ సూర్యనారాయణ, వీఈఈ సుధాకర్ ఆధ్వర్యంలో పంట కోత ప్రయోగం చేశారు. 25 చదరపు మీటర్ల విస్తీర్ణంలో 14.900 గ్రాముల ధాన్యం దిగుబడి వచ్చినట్లు సూర్యనారాయణ తెలిపారు. ఎకరాకు 29 బస్తాలు దిగుబడి వస్తుందన్నారు. ఈ పొలంలో నాలుగేళ్ల నుంచి నవధాన్యాలు, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగు చేసినట్లు చెప్పారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

శంభో శంకర..



జలుమూరు: శ్రీముఖలింగంలో పూజలు నిర్వహిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



సారవకోట: చీడిపూడిలోని ఉమారామకోటేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు



జలుమూరు: శ్రీముఖలింగంలో వారాహి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి డి.రామలింగేశ్వరరావు

కార్తీక మాసం నాల్గో సోమవారం శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచి భక్తులు బారులు తీశారు. ఆలయాల వద్ద శివనామస్మరణ మార్మోగింది. శివునికి క్షీర, జల, రుద్రాభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు, పోలీసులు చర్యలు తీసుకున్నారు. పలు ఆలయాల వద్ద మధ్యాహ్నం అన్నప్రసాద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీముఖలింగంలో స్పీకర్ తమ్మినేని సీతారాం, హైకోర్టు న్యాయమూర్తి డి.రామలింగేశ్వరరావు, పలువురు ప్రముఖులు పూజలు నిర్వహించారు.

- సాక్షి నెట్‌వర్క్



జలుమూరు: శ్రీముఖలింగంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ ధర్మాన పద్మప్రియ



ఆమదాలవలస రూరల్: శ్రీనివాసాచార్యులపేట శివాలయం వద్ద క్యూలో ఉన్న భక్తులు



హిరమండలం: సుభలయ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నగర సంకీర్తన చేస్తున్న కూర్మ గ్రామం హరేకృష్ణ భక్తులు



జలుమూరు: శ్రీముఖలింగంలో భక్తుల రద్దీ



జలుమూరు: శ్రీముఖలింగం ఆలయ ఆవరణలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



సరుబుజ్జిలి: పెద్దపాలెం భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



పాతపట్నం: మండల కేంద్రంలోని నీలకంఠేశ్వర ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు




ఎల్.ఎన్.పేట: తాయిమాంబపురం ఉమాకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు



జలుమూరు: శ్రీముఖలింగంలో మధుకేశ్వరుడి దర్శనానికి వచ్చిన హిజ్రాలు

జగనన్నే మళ్లీ సీఎం కావాలి



పోలాకి: ఉర్జాంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



ఆమదాలవలస రూరల్: రామచంద్రాపురంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



సారవకోట: చీడిపూడిలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సాధ్యమని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. పలు గ్రామ సచివాలయాల పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సచివాలయం పరిధిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను తెలియజేశారు. గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ జెండాలను ఆవిష్కరించారు. గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి గల వ్యత్యాసాలను వివరించారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



జలుమూరు: పాగోడులో సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



పొందూరు: తండ్యాంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం



సంక్షేమ పథకాల బుక్‌లెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన

సారవకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని అవలింగి సచివాలయ పరిధిలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కింజరాపు ధర్మారావు, బోర శ్రీరామూర్తి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని పలువురు మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గడపగడపకు నిధులతో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. మాజీ జెడ్పీటీసీ ధర్మాన పద్మప్రియ, బాడాన కృష్ణారావు, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, లైవ్‌స్టాక్ డవలప్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు నక్క తులసీదాస్, సారవకోట పీఏసీఎస్ చైర్మన్ గెల్లంకి వెంకటరావు, పార్టీ నాయకులు అంపోలు లచ్చుమయ్య, నిక్కు రాజశేఖర్, వెలమల సింహాచలం, ఎంపీడీఓ రాంబాబు, ఏఓ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన



మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు, అధికారులు

కొత్తూరు: అర్హులందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ డి.చక్రవర్తి, డిప్యూటీ ఈఓ లిల్లిరాణి అన్నారు. కొత్తూరులోని శ్రీవెంకటేశ్వర, వెంకటసాయి జూనియర్ కాలేజీల విద్యార్థులతో ఓటు నమోదుపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. తహసీల్దార్, డిప్యూటీ ఈఓ మాట్లాడుతూ 2024 జనవరి నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతీ విద్యార్థి ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాళ్లు జి.కృష్ణారావు, ఎల్.కృష్ణారావు, ఆర్ఐ గిరిష్‌కుమార్, వీఆర్వోలు, రేషన్ షాపు డీలర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎల్.ఎన్.పేట: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ స్కాట్‌పేట ఫీడర్ మరమ్మతులు, చెట్టుకొమ్మల తొలగింపు, కొత్తగా స్తంభాలు మంగళవారం ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఏఈ జి.శంకరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 5 గంటల వరకు కోవిలాం నుంచి స్కాట్‌పేట మధ్య ఉన్న గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తుందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. స్థానిక బ్రాహ్మణవీధి కూడలిలో ఉన్న కేఎస్ఎం ప్లాజాలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ఆత్మీయ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, వాటిని సోషల్ మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేయాలన్న లక్ష్యంతో పనిచేయాలన్నారు. రెడ్డి శ్రావణ్, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.ప్రదీప్, సచివాలయ మండల కన్వీనర్ సూర్యం, ఎస్ఎంఎస్ డైరెక్టర్ వెంకటరమణ, హిరమండలం పీఏసీఎస్ అధ్యక్షుడు ఎ.వి.సురేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ తాతయ్య, కర్రి లక్ష్మీనారాయణ, పనుకు మోహన్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి

- అధికారులకు ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఆదేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట(పోలాకి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలూ కల్పించాలని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సూచించారు. సోమవారం సాయంత్రం నరసన్నపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల సివిల్ సప్లయ్, రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రైతులకు ఐదు రోజుల్లోనే నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. స్థానికంగా జియో ట్యాగ్ ట్రక్కులు, ట్రాక్టర్లు అందుబాటులో ఉంచామన్నారు. మండలాల వారిగా మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేసి, బ్యాంక్ గ్యారెంటీలతో సిద్ధంగా ఉండేలా చేస్తున్నట్లు వివరించారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాను కూడా నియోజకవర్గంలోని కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షిస్తానని, రైతుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటానన్నారు. ధాన్యం కొనుగోలు ముగిసేవరకు అధికారులు అందుబాటులో ఉండాలన్నారు.

కూరగాయల స్టాల్ ఏర్పాటు



స్టాల్‌ను ప్రారంభిస్తున్న తహసీల్దార్

సారవకోట: సేంద్రియ పద్ధతుల్లో పండిన కూరగాయలు, ఇతర పంటల స్టాల్‌ను మండల పరిషత్ ఆవరణలో సోమవారం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఏర్పాటు చేశారు. వీటిని తహసీల్దార్ హనుమంతరావు ప్రారంభించారు. ప్రతీ సోమవారం ఈ స్టాల్‌లో సేంద్రియ పద్ధతుల ద్వారా పండించిన వివిధ రకాల పంటలను ఉంచనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాంబాబు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.